సమస్యల పరిష్కారానికి కృషి

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లప్పుడు ముందుంటానని మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. జీడిమెట్ల డివిజన్ రుక్మిణి ఎస్టేట్స్‌లో శిథిలమైన రోడ్డు విషయమై ఆదివారం స్థానికంగా పర్యటించిన ఆయన సమస్యను పరిశీలించారు. దీనిపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కొత్త రోడ్డు వేయాలని కోరగా సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట కాలనీ అధ్యక్షుడు శేఖర్, రాజు, నాగరాజు, నరసింహులు, మోహన్, రాజేందర్, రమేష్, శ్రీను, అశోక్, రాఘవ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కష్టపడితేనే విజయం సాధ్యం



విద్యార్థులకు పురస్కారం అందజేస్తున్న మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

సుభాష్‌నగర్: విద్యార్థులు కష్టపడి చదివితే అద్భుత విజయాలు మీ సొంతమవుతాయని మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గాజుల రామారంలోని సీఎంఆర్ మోడల్ హైస్కూల్ 24వ వార్షికోత్సవం పాఠశాల డైరెక్టర్ సత్తిబాబు, ప్రిన్సిపాల్ హరిశంకర్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్లారెడ్డి మాట్లాడుతూ తమ విద్యా సంస్థల ద్వారా వేలాది మందిని డాక్టర్లుగా ఇంజినీర్లుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో మల్లారెడ్డి మెడికల్ కాలేజ్ డైరెక్టర్ భద్రారెడ్డి, సీఎంఆర్ స్కూల్ సెక్రటరీ చామకూర గోపాల్ రెడ్డి, సీఎంఆర్ బోయిన్‌పల్లి స్కూల్ డైరెక్టర్ ఎస్.కె.రెడ్డి, మేనేజ్మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు శివయ్య, జానకిరామ్, వరప్రసాద్, రాంబాబు, శ్రీనివాస్ గౌడ్, రాంబాబు, హరి ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాహుల్ రెండో విడత యాత్రతో రాజకీయాల్లో పెను మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్ గాంధీ ఈ నెల 14 నుంచి చేపట్టనున్న రెండో విడత పాదయాత్రతో జాతీయ రాజకీయాల్లో పెను మార్పు సంభవిస్తుందని టీపీసీసీ మాజీ జాయింట్ సెక్రటరీ, ఓయూ జేఏసీ నేత ఏగూరి ఉదయ్‌కుమార్ పేర్కొన్నారు. మొదటి విడత చేపట్టిన భారత్ జోడో యాత్రతో దక్షిణాదిన పుంజుకున్న పార్టీ రెండో విడతలో ఉత్తరాదిన మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ నెల 14న ముంబయిలో ప్రారంభమై మణిపూర్ వరకు 6,700 కిలోమీటర్ల వరకు చేబట్టబోవు పాదయాత్ర ప్రజలను ప్రభావితం చేస్తుందన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, సామాజిక, లౌకికవాద భావాలకు తిలోదకాలిచ్చిన బీజేపీకి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని జోష్యం చెప్పారు. తెలంగాణలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన బీఆర్ఎస్ నేతలకు కూడా పార్లమెంట్ ఎన్నికల ఫీవర్ పట్టుకుందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఊహించని విధంగా కాంగ్రెస్ పార్టీ అధికార పగ్గాలు చేపట్టిన నెల లోపే పథకాల అమలుపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు.

ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు



మేయర్ నీలారెడ్డికి ఆహ్వానాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ సుధాకర్ తదితరులు

నిజాంపేట్: ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలని నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ 19వ డివిజన్ కార్పొరేటర్ కాసాని సుధాకర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో బాచుపల్లికి చెందిన శ్రీ భక్తాంజనేయ ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం మేయర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ నెల 9న ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న శ్రీ సప్తమాతృక, రాథమ్మదేవి పుష్కర కుంభాభిషేకం, శతచండీ యాగం, బోనాల వేడుకలకు రావాల్సిందిగా కోరుతూ మేయర్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు.

కనకదుర్గమ్మకు వెండి వస్తువుల విరాళం



వెండి శఠగోపం, వెండి పళ్లెం తీసుకువస్తున్న శివ వీరరాఘవయ్య, నాగమణి దంపతులు

రంగారెడ్డినగర్: రంగారెడ్డి నగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీకి చెందిన శివ వీర రాఘవయ్య, నాగమణి దంపతులు ఆదివారం కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయ ఆవరణలోని శ్రీ కనకదుర్గమ్మ వారికి వెండి పళ్లెం, వెండి శఠగోపం అందజేశారు. వాటిని స్వీకరించిన ఆలయ పూజారి వేద మంత్రోర్చనల మధ్య పూజలు నిర్వహించి వీరరాఘవయ్య, దంపతులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో కవిత, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు



నార్త్ సిటీ హైస్కూల్లో ముగ్గులు వేస్తున్న మహిళలు

సుభాష్‌నగర్: సూరారం నార్త్ సిటీ హైస్కూల్లో ఆదివారం విద్యార్థుల తల్లులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి ప్రిన్సిపాల్ కోల వెంకటేష్‌ముదిరాజ్ బహుమతులను అందజేశారు.

30 రోజుల కాంగ్రెస్ పాలనపై సంబురాలు

ఉస్మానియా యూనివర్సిటీ: కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 30 రోజులైన సందర్భంగా ఓయూలో విద్యార్థులు, నిరుద్యోగులు కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నెల రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో సీఎంతో పాటు మంత్రులు చేస్తున్న కృషిని అభినందించారు. భవిష్యత్ సుపరిపాలనకు ఇది తొలిమెట్టు అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జనరల్ సెక్రటరీ బాలలక్ష్మి, డాక్టర్ రామేశ్వర్‌రావు, శ్రీను, జానకిరాములు, వెంకట్ పాల్గొన్నారు.



నాలాపై పార్కు చేసిన కార్లు, ట్రాక్టర్ ఇతర వాహనాలు

పట్టించుకునేవారు లేక...

- అధికారుల పర్యవేక్షణ లోపం
- యథేచ్ఛగా అక్రమ పార్కింగ్‌లు
- ధ్వంసమవుతున్న నాలా స్లాబ్‌లు
- రూ.లక్షలు దుర్వినియోగం

చింతల్: అధికారుల నిఘా లోపం..దానికి తోడు స్థానిక ప్రజల నిర్లక్ష్యం కారణంగా రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన అభివృద్ధి పనులు దుర్వినియోగమవుతున్నాయి. చింతల్ డివిజన్‌లో గత కొన్నేళ్లుగా చేపట్టిన పలు ఓపెన్ నాలాలు, బాక్స్ నాలాలు శిథిలమైపోతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో పాటు పలు నాలాల వద్ద మూతలు విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. నాలాలను పరిరక్షించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అదే విధంగా రూ. కోట్లు వెచ్చించి చేపట్టిన ఫుట్‌పాత్‌లు అక్రమంగా వెలుస్తున్న దుకాణాలకు, వాహనాల పార్కింగ్‌లకు అడ్డాలుగా మారుతున్నా ట్రాఫిక్, ఆర్ అండ్ బి, జీహెచ్‌ఎంసీ అధికారులు విఫలమయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ప్రధాన రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లు లేకపోవడంతో రోడ్డుకు ఆనుకుని ఉన్న మట్టి రోడ్డు వరకు వాహనాలు నిలిపేవారు. అనంతరం రోడ్డు పక్కనే ఫుట్‌పాత్‌లు నిర్మించడంతో వాహనాలను రోడ్డు పైనే నిలపాల్సి వస్తోంది. దీంతో రోడ్డు మరింత కుచించుకుపోతుంది. ఈ కారణంగా నిత్యం చింతల్ నుంచి జీడిమెట్ల పోలీస్ స్టేషన్ వరకు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అదే విధంగా ఐడీపీఎల్–గాంధీనగర్ రోడ్డు, షాపూర్‌నగర్–గాజుల రామారం రోడ్డులో ఫుట్‌పాత్‌లలో అనేక దుకాణాలు వెలిశాయి. కొందరు వ్యక్తులు ఏకంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

దుర్వినియోగమతున్న నాలాలు..

చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్‌లో ఓపెన్ నాలాలు, బాక్స్ నాలాలు శిలావస్థకు చేరాయి. దీనికి ప్రధానంగా నాలాలపై పలు వాహనాలకు అడ్డాలుగా మారాయి. స్థానికంగా ఉండే కొందరు అక్రమ పార్కింగ్‌లకు అడ్డాలుగా మార్చుకున్నారు. నాలాలపై కార్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలను గత కొన్నేళ్లుగా నాలాలపై పార్కింగ్ చేస్తుండటంతో నాలాలపై ఉన్న సిమెంట్ బిళ్లలు, స్లాబ్ విరిగిపోయి నాలాలు ధ్వంసమయవుతున్నాయి. మరో చోట మిక్సింగ్ మిల్లర్లను సైతం నాలాలపైనే పార్కింగ్ చేస్తుండటం గమనార్హం. కొందరు ఇళ్ల నిర్మాణదారులు లారీల ద్వారా తెచ్చిన ఇసుక, కంకర, ఇటుకలను నాలాలపైనే డంపింగ్ చేస్తున్నారు. దీంతో నెలల తరబడి నాలాల పై ఉన్న మూతలు బరువులను తట్టుకోలేక విరిగి పడి నాలాల్లో కలిసిపోతున్నాయి. వీటిపై చర్యలు తీసుకోవడంతో జీహెచ్‌ఎంసీ అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొంతరు నాలాలపై పార్కింగ్‌లను, డంపింగ్‌లను అడ్డుకునే ప్రయత్నం చేయగా వారు స్థానిక నేతలు మద్దతు కూడగట్టుకుని అడ్డుకున్న వారిపై దూషణలకు దిగుతున్నట్లు తెలుస్తోంది.



బాలానగర్-ఐడీపీఎల్ రోడ్డులో ఫుత్‌పాత్‌పై బస్సును నిలిపిన దృశ్యం

బాలానగర్ రోడ్డులో బస్సుల పార్కింగ్..

ఐడీపీఎల్ నుంచి బాలానగర్ కు వెళ్లే మార్గంలో ఫుట్‌పాత్‌పై ఏకంగా బస్సులను నిలుపుతున్నారు. వీరిపై చర్యలు తీసుకోకపోగా పలు విభాగాల అధికారుల కనుసన్నల్లోనే ఈ పార్కింగ్ వ్యవహారం నడుస్తుందని విమర్శలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా ఐడిపిఎల్ గాంధీనగర్ రోడ్డులో నెలల తరబడి ఇసుక లారీలు పార్కింగ్ చేస్తున్నారు. కాగా ఈ రోడ్డుకు రూ.1.70 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయగా గతంలో ఉన్న పాత రోడ్డు ఎంత ఉందో ఇప్పుడు అంతే రోడ్డు అందుబాటులో ఉంది. మిగతా రోడ్డుపై పార్కింగ్, దుకాణా అక్రమంగా కొనసాగుతున్నాయి.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్సై హరీష్..

జీడిమెట్ల: సాంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవడం మన బాధ్యత అని జీడిమెట్ల ఎస్సై హరీష్ అన్నారు. ఆదివారం సంక్రాంతి పండగను పురస్కరించుకుని సుభాష్‌నగర్ డివిజన్ ఎస్.ఆర్.నాయక్ నగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్సై హరీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పోటీల్లో పాల్గొన్న కాలనీ మహిళలు రంగులతో కూడిన ముగ్గులను వేశారు. మొదటి బహుమతన్నే.శిరీష్, ద్వితీయ బహుమతి కే.జ్యోతి, తృతీయ బహుమతి ఎం.కీర్తి దక్కించుకున్నారు. విజేతలకు ఎస్సై హరీష్ కాలనీ పెద్దలతో కలిసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు టీటీకే శ్రీనివాస్, పూర్ణచందర్‌గుప్తా, గోపాల్‌రెడ్డి, బొబ్బా ప్రసాద్, సదానందచారి, వెంకటేశ్వరరావు, నాగశిరోమణి, సత్యనారాయణ, శ్రీనివాస్, కిరణ్, బాబి, సురేందర్‌రెడ్డి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లా జట్లతో కాసాని వీరేశ్

కబడ్డీ జట్ల ఎంపిక



కబడ్డీ జట్ల ఎంపికలో పాల్గొన్న కాసాని జ్ఞానేశ్వర్

నిజాంపేట్: సిద్దిపేట్ జిల్లా, గజ్వేల్‌లో ఈ నెల 11 నుంచి 14 వరకు నిర్వహించనున్న 49వ అంతర్ జిల్లా పోటీలకు మేడ్చల్ జిల్లా జూనియర్ బాలురు, బాలికల జట్ల ఎంపిక చేశారు. ఆదివారం బాచుపల్లిలోని కాసాని కబడ్డీ అకాడమీలో జరిగిన ఎంపిక పోటీలకు మాజీ ఎమ్మెల్సీ, మేడ్చల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్, ప్రధాన కార్యదర్శి కాసాని వీరేశ్ హాజరయ్యారు. సాట్స్ డీఎస్‌డీ సుధాకర్ ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జిల్లాకు మంచి పేరు తేవాలన్నారు. పోటీల్లో మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. నేషనల్ కోచ్ మాణిక్‌రాజ్, మహిళా కోచ్‌లు ఆత్యా సుల్తానా,రాధిక, కుమారి, కాసాని కబడ్డీ అకాడమీ మేనేజర్ సయ్యద్ షకీల్, కోచ్ అంజి, అకాడమీ సెక్రటరీ రామ్‌ప్రసాద్‌లు ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు.

బాలుర జట్టు సభ్యులు..

◆ ఎం.రాజశేఖర్, ఎం.దుర్గాసతీష్, ఇ.అరవింద్, సి.హెచ్.మనోజ్‌కుమార్, డి.శశిదర్, డి.ధనుష్, అజిత్, ఎం.రవీందర్, పి.విజయచక్రి, జె.శేఖర్, ఎం.అనిల్‌కుమార్, వి.పరమేశ్వర్..

బాలికల జట్టు ..

◆ జి.శరణ్య, బి.మానస, వి. భార్గవి, కె.అఖిల, టి.గజాలా, ఎం.గంగోత్రి, కె.శ్రీకృపా, వై.నీరజ, జి.సింధు ప్రియ, ఏ.దేవినా కుమారి, ఎస్. శిరీష, వి.శ్రావణి, ఆర్. శ్రీవాణి, ఎం.అనూష..

ఘనంగా 'సమన్వయ్'



అవార్డులు అందజేస్తున్న ఆర్తి సంపతి, శైలేష్ సంపతి

కుత్బుల్లాపూర్: కొంపల్లిలోని శివశివానీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో రెండు రోజుల పాటు జరిగిన 25వ సమన్వయ్ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో 1500 మంది విద్యార్థులు పాల్గొనగా జీవీ మాల్ మేనేజింగ్ పార్టనర్ కె.సుమంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను విద్యనభ్యసించిన కళాశాలకు ముఖ్య అతిథిగా రావడం గర్వంగా ఉందన్నారు. ఈ మేనేజ్‌మెంట్ ఫెస్ట్ విద్యార్థుల్లో నిర్వహణ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి దోహదపడుతుందన్నారు. నిరంతర అభ్యాసంతోనే పోటీ ప్రపంచంలో రాణించగలమని, సాంకేతికకు అనుగుణంగా నైపుణ్యాలను వృద్ధి చేసుకోవాలని సూచించారు. మొత్తం 11 ఈవెంట్లలో పోటీలు నిర్వహించగా ఐసీబీఎం బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థి శ్రేష్టా- ది యంగ్ మేనేజర్‌గా ఎన్నికకాగా రూ.50వేల నగదు బహుమతి అందజేశారు. కరీంనగర్‌కు చెందిన ఆల్‌ఫారోస్ విమెన్స్ డిగ్రీ కళాశాల సర్తాజ్ ఆఫ్ సమన్వయ్ ట్రోఫీని గెలుచుకుంది. ఈవెంట్లలో పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో శివశివాని విద్యా సంస్థల ప్రెసిడెంట్ ఆర్తి సంపతి, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శైలేష్ సంపతి, వైస్ ప్రెసిడెంట్ దీపికా సంపతి, డైరెక్టర్ డాక్టర్ రమణారావు, సమన్వయ్ కోఆర్డినేటర్లు డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ హరీష్, డాక్టర్ అరిజిత్, స్టూడెంట్ కో.ఆర్డినేటర్లు సాయిచరణ్, కిరణ్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్‌గా నర్సింహ



నర్సింహ
కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్‌గా నర్సింహ నియమితులయ్యారు. ఇక్కడ ఉపకమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న నాగమణి సంతోష్‌నగర్ సర్కిల్‌కు బదిలీ కాగా ఆమె స్థానంలో అక్కడ పని చేస్తున్న నర్సింహ కుత్బుల్లాపూర్‌కు ఉప కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కిల్ ప్రజలు సమయానికి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలన్నారు. అభయ హస్తం దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను గుర్తించనున్నట్లు తెలిపారు. రెవెన్యూ, టౌన్ ప్లానింగ్, శానిటరీ, విద్యుత్ తదితర విభాగాల అధికారులు, సిబ్బంది విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.

కమనీయం మల్లికార్జున స్వామి కల్యాణం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని మల్లికార్జున స్వామి వారి కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. యాదవ సంఘం అధ్యక్షుడు ఎక్కల్‌దేవ్ గోపాల్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్ అధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో రుద్రాభిషేకం, కోట్నం కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి, డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు మక్కాల నర్సింగ్‌రావు, కనకరాజుయాదవ్, బుర్రి యాదగిరి, కర్రె జంగయ్య పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



కొంపల్లి 4వ వార్డులో అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఇంటింటికీ అయోధ్య అక్షింతల పంపిణీ

రంగారెడ్డినగర్: అయోధ్య శ్రీ రామజన్మ భూమి నుంచి తెచ్చిన అక్షింతల పంపిణీ కార్యక్రమం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కొనసాగుతోంది. ఈ నెల 23న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవ నేపథ్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం ఆలయ కమిటీలు, హైందవ సంఘాల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి అక్షింతలను అందజేశారు. మేళా తాళాల మధ్య పల్లకీలో స్వామి అమ్మవార్లను ఊరేగిస్తూ అక్షింతలను పంపిణీ చేస్తున్నారు.

◆ కొంపల్లి మున్సిపల్ 4వ వార్డులో అక్షింతల పంపిణీ కార్యక్రమంలో సువర్ణ, కృష్ణ సాగర్, సతీష్‌సాగర్, మల్లికార్జునరావు, మంగారావు, రాజేశ్వరరావు, రామోహ్మన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ దూలపల్లి అశోకా ఏలా మైసన్ గేటెడ్ కమ్యూనిటీలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నేత మల్లారెడ్డి, గౌతమి విద్యా సంస్థల అధినేత రవీందర్‌రెడ్డి శ్రీరామ జన్మభూమి అక్షింతలను అందజేశారు.

◆ రంగారెడ్డినగర్ డివిజన్ నందానగర్‌లో అయోధ్య శ్రీరాముడి అక్షింతల ఊరేగింపు శోభాయాత్ర వైభవంగా జరిగింది. కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు రంగా శ్రీనివాస్‌గౌడ్, స్థానిక బస్తీ వాసులు పాల్గొన్నారు.



నందానగర్‌లో..



దూలపల్లి అశోకా ఏలా మైసన్ గేటెడ్ కమ్యూనిటీలో..



ఘనంగా సినర్జియా కార్నివాల్



సినర్జియాను ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్‌లోని డీఎంఎస్ స్కూల్‌లో ఆదివారం సినర్జియా కార్నివల్ వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన పాఠశాల డైరెక్టర్ అనిస్ ఫాతిమా, ఏపీ సమాచార శాఖ మాజీ కమిషనర్ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ సీఈ ఎం.ఏ.కరీం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నేటి విద్యా విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని, ప్రస్తుత సాంకేతిక విప్లవానికి అనుగుణంగా విద్యాబోధన జరుగుతోందన్నారు. విలువలతో కూడిన విద్యను అందించి విద్యార్థులను రేపటి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులపై ఉందన్నారు.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సత్కరిస్తున్న కాలనీ వాసులు

కుత్బుల్లాపూర్: హ్యాట్రిక్ విజయం అందించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, వారికి సేవ చేయడమే పరమావధిగా పని చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కృతజ్ఞతా యాత్రలో భాగంగా ఆదివారం జీడిమెట్ల డివిజన్ అంగడిపేట్, రుక్మిణి ఎస్టేట్స్, స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీ, జీడిమెట్ల గ్రామం, జయరామ్‌నగర్, అయోధ్యనగర్, కుత్బుల్లాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికులు పూల వర్షం కురిపించి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిరస్థాయిగా నిలిచిపోయే విజయాన్ని ప్రజలు తనకు అందించారని, తొమ్మిదేళ్లుగా చేసిన అభివృద్ధిని కొనసాగించి ప్రజల ఆదరాభిమానాలను పొందుతానన్నారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు కుంట సిద్దిరాములు, నరేందర్‌రెడ్డి, సుధాకర్‌గౌడ్, ఎల్లాగౌడ్, కాలే నాగేష్, బాల మల్లేష్, కాలే గణేష్, జైపాల్‌గౌడ్, మహిళా నాయకురాలు ఇందిరారెడ్డి, పద్మ, అరుణారెడ్డి, శ్యామల, కల్పన, కవిత, పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి పూర్తి సహకారం

◆ గాజులరామారం డివిజన్ వీనస్ రాక్స్ ఎన్‌క్లేవ్ నూతన సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వివేకానంద నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపి కాలనీ అభివృద్ధికి తన పూర్తి సహాయ సహకారాలుంటాయని భరోసా ఇచ్చారు. అధ్యక్షుడు వి.సి. వేమా రెడ్డి, ప్రధాన కార్యదర్శి మురళీధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రాజేష్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే వివేకానంద్‌పై పూల వర్షం కురిపిస్తున్న అంగడిపేట్ వాసులు

రోడ్డు సమస్యను పరిష్కరించండి

◆ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తంగా లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో చింతల్ డివిజన్ భగత్‌సింగ్‌నగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యం, అంబేడ్కర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జిల్లా వెంకటేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. . సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు బీసు వెంకటేశంగౌడ్, ప్రచార కార్యదర్శి ప్రేమ్ యాదవ్ ఉన్నారు.

అటెన్షన్ ప్లీజ్..

ముక్కు మూసుకోవాల్సిందే..

దుండిగల్: పెరిగిన ఇళ్లు, జనాభాకు తగ్గట్లుగా డ్రైనేజీ లైన్ల ఆధునికీకరించకపోవడం, మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలను తీయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.. దుండిగల్ మున్సిపల్ పరిధి దుండిగల్ తాండా–2లో ఇళ్లలోని మురుగునీరు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రధాన మ్యాన్‌హోళ్లలో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీరు ఇళ్లల్లోకి వెనక్కి తన్నుకు వస్తోంది. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, మురుగు కంపు భరించలేక పోతున్నామని తండా వాసులు వాపోతున్నారు. స్థానికంగా దోమల వృద్ధి పెరిగిందని, విషజ్వరాలు విజృంభించక ముందే అధికారులు జోక్యం చేసుకుని మ్యాన్‌హోళ్లల్లో వ్యర్థాలను తొలగించి మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మురుగునీరు వెనక్కి వస్తున్న దృశ్యం



దుండిగల్ తాండా–2లో మ్యాన్‌హోల్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు..